పదవులు అనుభవించి పార్టీకి ద్రోహం చేస్తావా..?

మాజీ ఎమ్మెల్యే బేతి పార్టీ మార్పుపై నాయకుల ఆగ్రహం

రామంతాపూర్ పూనం భవన్‌లో సమావేశమైన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

రామంతాపూర్,ఏప్రిల్ 18: పార్టీ అధికారంలో ఉండగా పదవులు అనుభవించి పార్టీకి ద్రోహం చేస్తావా అంటు రామంతాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని గురువారం విమర్శించారు. పూనం భవన్‌లో సమావేశమైన సీనియర్ నాయకులు మాట్లాడుతూ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి బీజేపీలో చేరడం పట్ల చరిత్రలో ఉద్యమ ద్రోహిగా మిగులుతారన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆయనకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఏ మొకం పెట్టుకొని ప్రజల్లో తిరుగుతారన్నారు.ఆయన పార్టీ వీడడం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. పార్టీని ఆయన వీడడం శనిపోయినట్లయిందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమన్నారు. అందరం కలిసికట్టుగా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగేశ్వర్‌రావు,నర్సింగ్‌రావు,ఇంద్రసేనా రెడ్డి,మధుసూదన్‌రెడ్డి ,రవిచారి,శ్రీనివాస్‌రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, ఏప్రిల్ 18 : పాలీసెట్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్ రాయడానికి 10వ తరగతి విద్యార్హత అని తెలిపారు. ఈనెల 22వ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్,బీజేపీలు దొందూదొందే..

బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల ప్రచార సరళి గురించి నాయకులకు వివరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

- ఓటమి అంచుల్లో ప్రతిపక్ష పార్టీలు
- తప్పుడు వాగ్ధానాలతో కాంగ్రెస్ మోసం
- ప్రచారంపై నాయకులకు ఎమ్మెల్యే 'మర్రి' దిశానిర్దేశం

మల్కాజిగిరి, ఏప్రిల్ 18: ఎంపీ ఎన్నికల్లో ఓటమి అంచుల్లో ప్రతిపక్ష పార్టీలు ఉన్నాయని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. గురువారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మల్కాజిగిరినియోజకవర్గం నాయకులతో ఎన్నికల ప్రచార సరళి గురించి ఎమ్మెల్యే వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే అని అన్నారు. ప్రజలకు తప్పుడు వాగ్ధానాలుచేసి ప్రజలను నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడంలేదని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతో ఉదరగొట్టిని కాంగ్రెస్ గద్దెనెక్కినంక వాటిని మరిచారని దీంతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. 'ప్రజాపాలన'లో దరఖాస్తులు చేసుకున్న ప్రజలు పథకాల కోసం అధికారులను అడిగితే జవాబు చెప్పడంలేదని అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధిస్తుందనారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన పథకాల ఫలాలు అందరికీ అందాయని, కాంగ్రెస్ పార్టీ అధికారులోకి వచ్చాక పథకాల ఉసేఎత్తడంలేదని అన్నారు. ఓటమి భయంతో ప్రతిపక్షాలు మల్లగుల్లాలు పడుతున్నాయని అన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్ధానాలపైన ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, కృష్ణమూర్తిగౌడ్, గోపాల్‌ముదిరాజ్, శేఖర్ గౌడ్, రాజుచారి, శేఖర్, స్వామిగౌడ్, కుమార్, మచ్చేందర్, రాజు, రామబ్రహ్మం పాల్గొన్నారు.

డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి

నేరేడ్‌మెట్: వినాయకనగర్ డివిజన్‌లో నెల కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ కార్యాలయంలో వినాయకనగర్ డివిజన్ ఉద్యమకారులు, కార్యకర్తలు కృష్ణమూర్తి గౌడ్, గోపాల్ ముదిరాజ్, ఇప్పశ్రీనివాస్ రెడ్డి, రంపె చంద్రమౌలి, శేఖర్ గౌడ్, రాజుచారి, శేఖర్, స్వామిగౌడ్, కుమార్, మచ్చేందర్, రాజు, రామబ్రహ్మం తదితరులు కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్, ప్రతి కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎలాంటి సమస్యలున్నా నా దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం..

కుషాయిగూడలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

చర్లపల్లి, ఏప్రిల్ 18: వేసవిలో తాగునీటి సమస్యల తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, కనకరాజుగౌడ్, శ్రీకాంత్ రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, కనకయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బోడుప్పల్, ఏప్రిల్18: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధి చెంగిచర్ల హనుమాన్ నగర్‌కు చెందిన యువకుడు నర్సింగారావు ఇటీవల అకాల మరణం చెందగా బీజేపై ఫౌండేషన్ ఆ కుటుంబానికి అండగా నిలిచింది. ఈ మేరకు గురువారం స్థానిక కార్పొరేటర్ చేతుల మీదుగా రూ.20వేలు నగదును అతని కుటుంబసభ్యులకు అందజేశారు.

మురుగునీటి రహిత నగరంలా తీర్చిదిద్దుతాం

మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్, ఏప్రిల్ 18: జవహర్‌నగర్‌ను మురుగునీటి రహిత నగరంలా తీర్చిదిద్దుతామని కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌లలో మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించి రోడ్లపై పారుతున్న మురుగునీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లపై మురుగు పారితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతి కాలనీలో భూగర్భ డ్రైనేజీని నిర్మిస్తామన్నారు. మురుగు నీటితో ప్రజలు అనారోగ్యాల పాలవుతారని, సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు బ్లీచింగ్ ఫ్లడర్ చల్లుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను సహించం

అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

జవహర్‌నగర్, ఏప్రిల్ 18: అక్రమ నిర్మాణాలను సహించేది లేదని, జవహర్‌నగర్‌లో పూర్తిగా ప్రభుత్వ భూములే ఉన్నాయని, కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి హెచ్చరించారు. కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో గురువారం కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఈటల సేవలు దేశానికి అవసరం

సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి హరిబిప్‌సింగ్ పూరి, పక్కన ఈటల రాజేందర్,కిషన్ రెడ్డి

మేడ్చల్,ఏప్రిల్18: అనుభవశాలి అయిన ఈటల రాజేందర్ సేవలు దేశానికి అవసరమని కేంద్ర మంత్రి హరిదీప్‌సింగ్ పూరి అన్నారు. మేడ్చల్ మండలం పూడూరు గ్రామ పరిధిలోని ఈటల రాజేందర్ ఇంటి వద్ద గురువారం నామినేషన్‌కు ముందు సభ నిర్వహించారు. ఈ సభకు కేంద్ర మంత్రులు హరిదీప్‌సింగ్‌తో పాటు కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గం ఓ మినీ ఇండియా అన్నారు. రాష్ట్రంలో ఏడేండ్లు ఈటల రాజేందర్ మంత్రిగా పని చేశారని, కరోనా కాలంలో ఆయన ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. ఆయన అనుభవం దేశానికి సేవలు అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు ఆయనను గెలిపించి, పార్లమెంట్‌కు పంపాలని సూచించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ మల్కాజిగిరిలో బీజేపీని గెలిపించాలని కోరారు. బీజేపీకి ఓటు వేయడానికి ప్రజలు సిద్ధం ఉన్నారన్నారు. ఈ సభలో కంటోన్మెంట్ అభ్యర్థి వంశీ తిలక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బొడిగ శోభ, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, నాయకులు సామ రంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, శిల్పారెడ్డి, కొప్పు భాష, ఆర్‌కే శ్రీనివాస్, మల్లారెడ్డి, తాడూరి శ్రీనివాస్, రాజయ్య యాదవ్, వేణుగోపాల్, మల్క కొమురయ్య, సుధాకర్ గాండే, వీకే మహేశ్, నందారెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, గిరివర్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్ప ల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఆయన సతీమణి స్వప్న, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్ బీజేపీలో చేశారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రచారం

చర్లపల్లి, ఏప్రిల్ 18: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రచారం సాగిస్తున్నామని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా గురువారం డివిజన్ పరిధిలోని చక్రీపురం, పద్మశాలి టౌన్‌షీప్, వాసవిశివనగర్ తదితర ప్రాంతాల్లో పట్నం మనీషారెడ్డితో కలిసి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావనీమణిపాల్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, సీతారామిరెడ్డి, ప్రసాద్, వెంకట్‌రెడ్డి, పోచయ్యగౌడ్, బాల్‌రెడ్డి, నాగరాజు, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ పై లైంగిక దాడి..

ఘట్‌కేసర్,ఏప్రిల్18: మహిళపై లైంగిక దాడి చేసిన వ్యక్తిని పోచారం పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.సీఐ రాజు కథనం ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని ఓ కాలనీలో నివాసం ఉండే ఓ మహిళ(36) ఈనెల 16న ఘట్‌కేసర్‌లో పనిముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా, అన్నోజిగూడకు చెందిన ఉమేశ్‌నాయక్ ఆమెను అడ్డగించి తన బైక్‌పై బలవంతంగా ఎక్కించుకొని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి ఆమెపై లైంగిక దాడి చేశాడు. దీంతో బాధిత మహిళ చేసిన ఫిర్యాదు మేరకు గురువారం ఉమేశ్ నాయక్‌ను పోచారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదాల అడ్డుకట్టకు చర్యలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్ రెడ్డి, సీఐ హనుమాన్ గౌడ్

- నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు
- వాహనదారుల తప్పిదాలతోనే ప్రమాదాలు
- ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి వెల్లడి

మేడ్చల్, ఏప్రిల్ 18: రోడ్డు ప్రమాదాలు అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి తెలిపారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన గురువారం సీఐ హనుమాన్ గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను 15 నుంచి 20 శాతం తగ్గించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. అయితే వాహనదారుల తప్పిదాల వల్ల ప్రమాదాలు తగ్గకపోవడం సరికదా పెరుగుతున్నాయని తెలిపారు. గత ఆరు నెలల కాలాన్ని తీసుకుంటే మొదటి మూడు నెలల్లో మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 15 ఘోర ప్రమాదాలు జరిగాయని,ఆ తర్వాత మూడు నెలల్లో ఆ ప్రమాదాల సంఖ్య 25కు పెరిగిందన్నారు. చాలా సందర్భాలు వాహనదారులు నిబంధనలు అతిక్రమించడం వల్లే జరిగాయని తెలిపారు. మీడియన్ దాటుతూ, మద్యం తాగి వాహనాన్ని నడపటం, రాంగ్ రూట్‌లో వెళ్లడం, అతివేగంగా వాహనాలు నడిపించడం తదితర కారణాల వద్ద ప్రమాదాలు జరిగాయన్నారు. ఇటీవల క్లాసిక్ దాబా వద్ద జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మీడియనే దాటే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో, వెనుక నుంచి వచ్చిన బస్సు అతడిపై నుంచి వెళ్లిందన్నారు. అలాగే కూతురుతో కలిసి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ట్రక్ పక్క నుంచి వెళ్తుండగా అదుపుతప్పిందని, చనిపోయిన వ్యక్తి కుడివైపు, కూతురు ఎడమవైపు పడిందన్నారు. తండ్రిపై నుంచి ట్రక్ వెళ్లడంతో మృతి చెందాడని, పాప బతికిందని తెలిపారు. చాలా వరకు ప్రమాదాలు ఇలాంటి జరుగుతున్నాయని ఆయన చెప్పారు.జాతీయ రహదారి 44పై వాహనాలు రద్దీగా అధికంగా ఉంటుందని,బైక్, కార్లు, లారీ, ట్రాక్టర్లతో పాటు భారీ వాహనాలు వెళ్తున్నాయని తెలిపారు. రోడ్డుపైకి వచ్చే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల నుంచి జాతీయ రహదారికి వాహనాలు వచ్చేటప్పుడు, జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లేటప్పుడు ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదం జరిగి ప్రాణాలను కోల్పోతే కుటుంబం ఆర్థికంగా చితికిపోతుందని, దిక్కులేనిదై పోతుందన్నారు. ఈ విషయాన్ని వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన సూచించారు. ప్రమాదాలను అరికట్టడానికి జరిమానాలు విధిస్తామని, కేసులు పెడుతామని, మార్పు రాకపోతే చట్టరీత్యా కేసులు నమోదు చేసి, జైలు కూడా పంపుతామని ఆయన హెచ్చరించారు. రాంగ్ రూట్లో వచ్చే వాహనాలను అరికట్టడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాంగ్ రూట్లో రావడం, ఇష్టానుసారంగా వాహనం నడిపితే 336 కింద కేసు పెడుతామని, నంబర్‌ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలపై 419 కింద కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు. శబ్ద కాలుష్యాన్ని కల్గించే హారన్‌లు, సైలెన్సర్‌లను వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. లైటింగ్ లేని కారణంగా, మీడియన్ ఏపుగా పెరిగిన చెట్ల వల్ల కూడా పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు రోడ్లపై విద్యుత్ దీపాలను ఏర్పా ట్లు చేయాలని, ప్రమాదకరంగా ఉన్న తీగలను సరి చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు సంబంధిత శాఖకు సీపీ నుంచి లేఖ రాస్తామని తెలిపారు. ప్రయాణికులు చిన్న చిన్న తప్పిదాలతో ప్రమాదాలను పణంగా పెట్టొద్దని, ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లి, ప్రయాణం సుఖమయం చేసుకోవాలని ఆయన కోరారు.

అక్రమ మద్యం పట్టివేత

ఘట్‌కేసర్,ఏప్రిల్18: ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వేర్వేరు ప్రాం తాల్లో అక్రమ మద్యం పట్టుకున్నట్లు సీఐ సైదులు తెలిపారు. ఎన్ఎస్‌సీనగర్‌కు చెం దిన పన్నాల మంగమ్మ తన ఇంట్లో బెల్ట్‌షాప్‌ను నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో మహిళా పోలీసుల సహాయంతో ఆమె ఇంట్లో తనిఖీ చేయగా ఆఫీసర్ చాయిస్ 90ఎంఎల్ 50బాటిళ్లు లభించాయి.బాటిళ్ల విలువ రూ.4,950గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు.అదేవిధంగా కొండాపూర్ గ్రామంలోని కొంపల్లి వెంకటేశ్వర్లు ఇంట్లో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడన్న సమాచారం తో తనిఖీ చేయగా కింగ్‌ఫిషర్ 650 ఎంఎ ల్ 12 బాటిళ్లు లభించాయని, వాటి విలువ రూ.1950ఉన్నట్లుగా పోలీసులుతెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్లాస్టింగ్ నిర్వాహకుల అరెస్టు

మేడ్చల్,ఏప్రిల్ 18: అక్రమంగా బ్లాస్టింగ్‌ల పై ఎస్వోటీ పోలీసులు దాడి చేశారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని తూం కుంటలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో అక్రమంగా బ్లాస్టింగ్‌లు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్వోటీ పోలీసులు శామీర్‌పేట పోలీసులతో కలిసి గురువారం దాడి చేశారు. అనుమతులు లేకుండా పేలు డు పదార్థాలను ఉపయోగించి బండరాళ్ల ను పేలుస్తుండగా పట్టుకున్నారు. కంప్రెషర్ యజమాని, ఆపరేటర్ విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సైట్ ఇంజినీర్ రోజా, జెలిటిన్ స్టిక్స్, డిటోనేటర్ల సరఫరాదారులు పరారీలో ఉన్నారు. ఈ దాడిలో రూ.5వేల విలువైన జిలిటెన్ స్టిక్స్, డిటోనేటర్లు, రూ. 2.45 లక్షల కంప్రెషర్ వాహనం, రూ.5 వేల విలువైన స్విచ్‌బాక్స్ మొత్తం రూ.2. 57 లక్షల ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

మేడ్చల్, ఏప్రిల్ 18: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... శామీర్‌పేట మండల పరిధిలోని బాబాగూడ గ్రామానికి చెందిన కాసాల సంపత్ గౌడ్(23) తల్లి, చెల్లితో కలిసి నివసిస్తున్నాడు. అతడు నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండు నెలల నుంచి సంపత్‌ను పని చేసే కంపెనీ తాత్కాలికంగా పక్కకు పెట్టింది. దీంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబానికి అతడే ఆసరాగా కావడం, రెండు నెలలుగా వేతనం రాకపోవడంతో ఆర్థికంగా కుంగిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరిన సంపత్ గ్రామ శివారులోని చెట్టుకు ఊరేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

లక్షే లక్ష్యం కావాలి

కార్యక్రమంలో పాల్గొన్న డిపో మేనేజర్ సుధాకర్, డ్రైవర్లు, కండక్టర్లు

మేడ్చల్, ఏప్రిల్ 18 : ప్రతి రోజు రూ.లక్ష అదనంగా వసూళ్లు సాధించడానికి డ్రైవర్లు, కండక్టర్లు కృషి చేయాలని మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ సూచించారు. టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ 2024 ఉగాది నుంచి 2025 ఉగాది వరకు ఏడాదికి లక్షే లక్ష్యంగా నామకరణం చేశారు.

అందులో భాగంగా డిపో మేనేజర్ సుధాకర్ డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లతో గురువారం ప్రతి రోజు రూ.రూ.లక్ష అదనపు వసూళ్లు సాధించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, సెక్యూరిటీ, మెకానికల్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో ఈదురు గాలులకు ఎగిరిపోయిన ఓ ఇంటిపై కప్పు రేకులు

గాలివాన బీభత్సం

- ఈదురు గాలులకు... ఎగిరిపోయిన ఇంటిపై కప్పు రేకులు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు..విద్యుత్‌కు అంతరాయం

జవహర్‌నగర్,ఏప్రిల్ 18: ఈదురు గాలుల వర్షానికి జవహర్‌నగర్‌లో చెట్లు, విద్యుత్ స్తంభాలు, ఇంటి రేకులు ఎగిరిపోయాయి. గురువారం సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన ఈదురు గాలులకు అతలాకుతలమైంది. కార్పొరేషన్‌లోని రాజీవ్‌గాంధీనగర్, గబ్బిలాల్‌పేట, శాంతినగర్, అయ్యప్పకాలనీ, యాదవసంఘంకాలనీలో పెద్ద ఎత్తున చెట్లు విగిరిపోయాయి. పేదల ప్రజలు నివసించే కాలనీలో అకాల వర్షంతో ఒక్కసారిగా హతశయులయ్యారు. ఇంటి రేకులు ఎగిరిపడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పేదలు బిక్కుబిక్కుమంటు గడిపారు.అకాల వర్షానికి ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నాగారం మున్సిపాలిటీ పరిధిలో...

మేడ్చల్ కలెక్టరేట్: నాగారం మున్సిపాలిటీ పరిధిలో గురువారం సాయంత్రం గాలితో కూడిన వర్షంకురిసిం ది. దాదాపు గంటల పాటు కురిసిన వర్షానికి రోడ్లు, వీధులు జలమయమయ్యా యి. పెద్దఎత్తున వీచిన గాలికి చెట్లు విరిగిపడ్డాయి.విద్యుత్‌స్తంభాలు నేల కొరగగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

నాగారం మున్సిపాలిటీలో కురుస్తున్న వర్షం

జవహర్‌నగర్‌లో కూలిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకుందాం..

దుండిగల్, ఏప్రిల్ 18 : ప్రజాసేవ చేసే నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా గురువారం గాజులరామారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, బేకరీ గడ్డ, ఎన్టీఆర్ నగర్‌లో ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు, నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులతో సంబంధం లేకుండా లక్ష్మారెడ్డి గత 20 ఏండ్లుగా ఎన్నో సామాజిక, సేవా, ఉపాధి కార్యక్రమాలతో నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్నాడని, ఆయ న్ను భారీ మెజార్టీతో గెలిపిస్తే బస్తీలు,కాలనీలు అభివృద్ధి చెందుతాయన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన తప్పనిసరి

కొండాపూర్, ఏప్రిల్ 18 : గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ భవనంలో గురువారం మాదాపూర్ అగ్నిమాపక అధికారులు ఫైర్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ డీజీ నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిప్రమాదాలపై హైదరాబాద్ బిల్డర్స్, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్లతో అవగాహన సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్ ఫైర్ స్టేషన్ అధికారులు,సిబ్బంది, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాల నివారణ

కేపీహెచ్‌బీ కాలనీ : అగ్ని ప్రమాదాలను నివారణకు ముందు జాగ్రత్తలే మేలని కూకట్‌పల్లి ఏడీఎఫ్ఓ వై.సైదులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్, ఐడీఏ కూకట్‌పల్లి పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదాల నివార ణపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. పరిశ్రమల్లో అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారమివ్వాలని సూచించారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL. DISTRICT JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT : AT MALKAJGIRI

**A.